తెల్లవారుతూనే వచ్చింది అరుణ.

తలుపు తెరవగానే కనిపించిన అరుణని చూసి దయ్యాన్ని చూసినట్టు బెదిరిపోయింది రజని. ఉలిక్కిపడి పక్కకి తప్పుకుంది.

తల వంచుకుని లోపలికి అడుగెట్టి, చేతి సంచీని పక్కన వుంచి, గోడకి ఆనుకుని కూర్చుంది అరుణ.

క్షణాల్లో తాను తేరుకుని, ఈ వార్తని లోపలికి చేరవేసింది రజని.

ఆ వెంటనే—

ఆ యింట్లో—

శవంలేచిన పరిసరాల్లో వుండే నిశ్శబ్దం; పొలిమేరల్లో తారాడే ప్రశాంతీ—ఈ రెంటికీ నడుమ కొంప మునిగినప్పుడు మనుషుల్లో తాండవించే తొక్కిసలాట, తడబాటు, దుఃఖం, ఆక్రోశం, ఆవేదన ఒకేసారి అలముకున్నై.

*

బారెడు పొద్దెక్కింది.

ఇంట్లో అరుణ తల్లితండ్రులు – సీతమ్మ, రామ్మూర్తీ, అక్కలిద్దరూ రజనీ, శారదా – అంతా అరవడం, తిట్టడం, కొట్టడం, ఏడ్వడం, మొత్తుకోవడం అయిపోయి, అలసిపోయి తలపట్టుక్కూర్చున్నారు.

సీతమ్మ కొంగుతో కళ్ళొత్తుకుంటూ దొడ్లోకీ, ఇంట్లోకీ తిరుగుతూ ఆ పనీ ఈ పనీ చేసుకుంటోంది. కానీ, ఆవిడ కాళ్ళు మొండికేస్తున్నాయి, మనస్సు మొరాయిస్తోంది.

అరుణ అన్న విశ్వం ఊళ్ళో లేడు. అరుణ వేటలో అమ్మమ్మగారి పల్లెకు వెళ్ళాడు. ముసలమ్మ – అరుణ 'బామ్మ' మంచంలో పడి వుంది. ఆవిడకి పక్షవాతం. కాలూ, చెయ్యీ ఆడవు. చూపూ ఆనదు. వినికిడీ తక్కువే. ఇంట్లో సంచలనం అంతా వివరం లేని సవ్వళ్ళలా తోస్తూ వుంది ఆవిడకి. ఆవిడ ఆలోచనకి మాత్రం రెక్కలు వున్నాయి. అవి ఖచ్చితంగా వాస్తవాన్ని పసికట్టనూ గలవు. విషయం మీద వాలనూ గలవు. అరుణ తిరిగొచ్చిందని అర్థమైంది ఆవిడకి. అయితే, ఆ రణగొణధ్వనుల మధ్య, రాళ్ళవాన మధ్యా తనేమీ మాట్లాడలేదు.

చుట్టుపక్కలవాళ్ళు గుసగుసలు పోవడం మొదలైంది.

"అరుణ తిరిగొచ్చిందిట!" ఈ వార్తని గుండెల్లో దాచుకోలేక గుబగుబలాడసాగేరు. ఆడవాళ్ళ ఆరాటానికి అంతం లేదు. సీతమ్మా-రామ్మూర్తీ సంసారానికి సంబంధించిన నూటొక్క వృత్తాంతాలూ, అటూ ఇటూ ఏడు తరాలవారి కథలూ బయటికి వస్తున్నాయి. నరం లేని నాలుకతో నానా మాటలూ దూకుతున్నాయి. అరుణ పునరాగమనం మొత్తానికి ఆ వీధి వీధినీ కదిలించింది.

ఆ యింటి యజమానురాలు రావులమ్మ హాలు గుమ్మం దగ్గర నిలబడి పోలీస్‌స్టేషన్లో నేరస్థుణ్ణి చూసే ఉత్సుకతతో – అరుణ కేసి చూస్తూ బుగ్గలు నొక్కుకుంటోంది.

"అదుపులేని గుర్రాలు అగడ్తలు దాటతాయన్నారు ఇందుకనే" అంది సీతమ్మని ఉద్దేశించి.

రావులమ్మంటే సీతమ్మకీ, ఇంట్లో అందరికీ అదో విధమైన గౌరవం వుంది. అంతకుమించి, పాతికరూపాయల నామ మాత్రపు బాడుగకు ఇంట్లో వాటాని తమకిచ్చి చాలా సహాయం చేస్తున్నదనే కృతజ్ఞతా భావమూ వుంది; కష్టానికీ సుఖానికీ మాట సాయింతోపాటు అవసరమైతే నాలుగు రూకల అప్పు సాయమూ చేస్తుంది కనుక అమె ఏదైనా ఏమాట తూలి మాట్లాడినా, నొచ్చుకోని తత్త్వమూ వుంది.

గుమ్మం బయట నిలబడిన కొమ్మలంతా తలా వొక మాటా అంటూ ఈ సమస్య వుత్పన్నమవడానికి కారణాలూ, పరిష్కారమార్గాలూ తమకు తామే సూచించుకుంటూ చర్చ సాగిస్తున్నారు.

"పదిహేనేళ్ళ గుంట మరీ పొయ్యేకాలం కాకపోతే ఏవిటీ పని?" ఎవరో అంటున్నారు.

వ్రణం మీద ఉప్పు రుద్దినట్లయింది అరుణకు. మోకాళ్ళ మీద ఆనించిన తలని కదిలించి పక్కకి చూసింది అరుణ.

రజని తనవైపు పులుకు పులుకున చూస్తోంది. 'అవును, దానికి మామూలుగానే తనంటే మంట. కొద్దిసేపటి క్రితం చిన్నక్క శారదతో అన్నది: పాతికేళ్ళొచ్చినా మనం మొద్దుల్లా ఇలాగే వున్నాం కానీ, పదేళ్ళ వెనకాల పుట్టిన ఈవిడకి మొగుడి తొందరొచ్చింది" అని!

రజని, శారద దాదాపు ఒక్కలాగే వుంటారు. ఒడ్డూ, పొడుగూ ఒక్కలాగే వుంటాయి – పెద్దగా తేడాలేదు. వాళ్ళిద్దరి మధ్య వయస్సులో వ్యత్యాసం ఏడాదిన్నరేనట. వున్న తేడా అల్లా అదేనేమో. అయితే మనసుకు సంబంధించినంతవరకూ అక్కలిద్దరికీ మధ్య అసలు పోలికేలేదు. రజని – ఎదుటివాళ్ళ గుండెకు తూట్లు పొడవడంలో నేర్పరి. శారద – గుండె గాయాన్ని మాన్పలేదేమోగానీ, తానుగా కందిరీగలా కుట్టదు.

అరుణ తిరిగిరావడం అమ్మలక్కల్లో కొందరికి నిరాశ కలిగించింది. ఈ కథ ఇలాంటి మలుపు తిరగడంతో వాళ్ళ ఉత్సాహం మీద నీళ్ళు చల్లినట్లయింది.

"లేచిపోయింది పోక, తగుదునమ్మా అంటూ తిరిగొచ్చింది చూడండి." అంటూ వోయమ్మ ఆశ్చర్యాన్ని వొలకపోస్తే "నాలుగు రోజుల్లోనే ప్రియుడు పాతబడ్డాడేమో?" అని కిసుక్కున నవ్వింది వోపడుచు.

ఈ మాట అన్నదెవరో అరుణకి తెలుసు.

రంగమ్మగారి కోడలు వరాలు, ఇరవైవొక్కయేళ్ళకే అయిదుగురు సంతానం. బిడ్డ తర్వాత బహిష్టవకుండానే మళ్ళీ మళ్ళీ కడుపుతో వుండటం ఆవిడ ప్రత్యేకత-అని, అమ్మ, రావులమ్మ వాళ్ళు చెప్పుకోవడం అరుణకి గుర్తుకొచ్చింది. అసలీ వరాలికీ వాళ్ళ మేన బావకీ చాటుమాటు వ్యవహారం వుందనే మరో కథ అమ్మలక్కల తీరుబడి చర్చల్లోకి వస్తూనే వుంటుంది. మెళ్ళోతాళి ఆడదానికి ఎంతటి రక్షణనీ, ధైర్యాన్నీ యిస్తుంది!

"చూడ్డానికి బాగానే వుంది. పిల్ల నీరు పట్టింది కూడా"

"నీరు పట్టిందో, నీళ్ళోసుకుందో-" మరో అమ్మలక్క హాస్యం. నాలుగు నోళ్లు నవ్వినై; నాలుగు నొసళ్లు చిట్లించినై. నలభై వేళ్ళు మెటికలు విరిచినై.

విశ్వం వచ్చాడు. రాగానే అరుణని చూశాడు.


"తెల్లవారుతూనే వచ్చింది" రజని చెప్పింది. పరిస్థితి అర్థమైంది. ఇంకా అక్కడ కూడివున్న ఆడవాళ్ళకేసీ, పిల్లలకేసీ వోసారి తీక్షణంగా చూసి వీధి తలుపు తక్కున మూసేశాడు.

అతనికి కోపం ముంచుకొచ్చింది. రుద్రుడై పోయాడు.

తల వంచుకుని కూర్చున్న అరుణ జుట్టు పట్టుకుని పైకెత్తి – ఆమె కళ్ళల్లోకి చూస్తూ చింత నిప్పులు కురిపించసాగేడు.

"దొంగముండా. ఎక్కడచచ్చావ్ ఇన్నాళ్ళూ?" అంటూ అరుణని బాదడం మొదలుపెట్టాడు.

"మమ్మల్నందర్నీ ఉరితీసుకు చావమన్నావా?




"ఇవ్వాళ అందర్నీ చంపేస్తాను. కట్ట కట్టి ఏ రైలుకిందో తోసేస్తాను. చావండి. పదోతరగతి చదివే గుంటముండ-దీనికింత బరితెగింపా? అసలు మీ ఇద్దర్నీ అనాలి. ముగ్గురు ఆడపిల్లల్ని నా గుండెల మీద కుంపటిలా పడేసి నా ప్రాణం తీస్తున్నారు. నాకొచ్చే నాలుగొందల్లో ఏడు పొట్టలు నిండడమే కనాకష్టంగా వుంది. ఇంకా పెళ్ళిళ్ళేం జేస్తాం? ఆ పెద్దవాళ్ళిద్దర్నీ ఎనిమిదో తరగతిలో ఆపేసి కూర్చో బెట్టినట్టు - దీన్నీ ఏడవవండే అంటే విన్లేదు. చివరి పిల్ల, చదివి ఉద్దరిస్తుందని చదవ మంటిరి. చదివించిగా చదువు - ఏడవండి - బాగా ఏడవండి....ఛీ...వెధవ బతుకు. తల నేలకేసి కొట్టుకు చావాలనిపిస్తోంది. పోయింది పోయి ఏ కృష్ణలోనో దూకి చావక తగుదునమ్మా అంటూ కొంపకు తయారైంది చూడండి. గుండెలు తీసిన బంటు''

ఉదయం రామ్మూర్తి, సీతమ్మా ఏడ్చిన ఏడుపునే మళ్ళీ ఇప్పుడు విశ్వమూ వెళ్ళబోసుకున్నాడు.

అరుణ బెల్లం కొట్టిన రాయిలా అలాగే కూర్చుంది. ముక్కు పుటాలెగరేస్తూ లోలోపలే ఏడుస్తూ ఆలోచిస్తోంది. ఆలోచిస్తూ ఏడుస్తోంది. ఇసుకలో కూరుకు పోయిన నావలా కుంచించుకు పోతోంది. కనుపు దగ్గర నరికి మట్టిలో తొక్కేసిన కొమ్మలా విలవిల్లాడి పోతోంది. హృదయం పరితప్తం అయిపోయి-చూపు గుండెల్లోకి కూరుకు పోతోంది. నాలుక ఉంగలు చుట్టుకుపోయి కొన్ని జన్మల నుంచీ మూగతనంతో మెలికలు తిరుగు తున్నట్టయి పోతోంది.

ఆ పిల్ల గుండెల్లో గునపాలు దిగుతున్నాయి. మెదడులో డైనమైట్లు పేలుతున్నాయి. తనకీ లోకంలో స్థానం లేదా? ఈ లోకానికి తనతో ఏ సంబంధమూ లేదా? లోకంలో ఇంత చిమ్మ చీకటి వుందా? నేను చచ్చిపోవాలా? ఎందుకు? ఎలా?

శతకోటి సందేహాలూ, కోటికోట్ల ప్రశ్నలూ! అన్నీ జవాబు లేని ప్రశ్నలు! జవాబు తెలీని ప్రశ్నలు!

అరుణ సొమ్మసిల్లి పడిపోయింది. ఎవ్వరూ పట్టించుకోలేదు.

జాతరలో గుడబిడల్లా రామ్మూర్తీ, సీతమ్మా, విశ్వం, రజనీ-తమకు తాము చెప్పుకుంటున్నట్టు ఏవేవో అస్తవ్యస్త ప్రేలాపనలు చేస్తున్నారు.

"ఏగానీ సంపాదన లేని అసమర్థపు ముండా నిన్ను చంపి మేమూ చస్తాం. ఏం జరిగింది నీకసలు? దయ్యం పట్టిందా?''

అరుణ మాట్లాడ లేదు. అన్నిటికీ ఒడిబట్టి కూర్చుంది.

విశ్వం మరీ రెచ్చిపోయేడు. అతని నోటికి రాని తిట్టు లేదు. అనొచ్చు, అనకూడదు - అని లేకుండా బండబూతులు తిడ్తున్నాడు. అరుణ శరీరం మీద ఎక్కడపడితే అక్కడ పిడిగుద్దులు గుద్దుతున్నాడు. పొర్లించి, పొర్లించి కొడ్తున్నాడు.

రామ్మూర్తిగానీ, సీతమ్మగానీ, రజనిగానీ ఒక్క మాట మాట్లాడ లేదు. విశ్వాన్ని అడ్డుకో లేదు. శారద ఇంక చూడలేక పోయింది. అరుణకి అడ్డుగా వెళ్ళి నిల్చుంది. అప్పటికి విశ్వానికీ ఆయాసం వచ్చింది. రొప్పుతూ మంచం మీద కూలబడిపోయేడు

కొడుకుని, అరవైయేళ్ళొచ్చి, అడ్డమైన వాళ్ళ నోటా నానాల్సొచ్చింది. అసలు నే చస్తేగానీ ఈ కొంపకి పట్టిన శని సగం వదలదు—''

తండ్రి కేసి ఈసడింపుగా చూశాడు విశ్వం.

సీతమ్మ వంటింట్లోకి నడుస్తుంటే అడిగాడు విశ్వం. "ఇంతకీ జరిగిందేవిటో నీకన్నా చెప్పి చచ్చిందిటమ్మా!'' అని.

"దాని నోరు పడిపోయింది. ఒక్క మాటా పలుకులేదు. పొద్దున్నుంచీ'' సమాధానం చెప్పింది రజని. రామ్మూర్తి కావడిపెట్టెను అనుకుని తల పట్టు కూర్చున్నాడు.

సీతమ్మ అన్నది. "చెప్పేందుకేముంది? రైలు ఛార్జీలు దీని మొహాన్న కొట్టి వాడెక్కడికో ఉడాయించి వుంటాడు. ఇదేమో దేబె మొహం వేసుకుని తిరిగొచ్చింది.''

"అదిసరే. ఎక్కడ చచ్చారో. ఏం చేశారో ఏడ్చిందా అని—'' తల్లి నుంచి తనక్కావలసిన సమాధానం రానందుకు విసుగుదలగా అడిగేడు విశ్వం. ఈ ప్రశ్నని అడిగేటప్పుడు అతని సంకోచం కంఠంలో ధ్వనించింది.

"ఏవీ చెప్పలా'' అంటూ వంటింట్లోకి నడిచింది సీతమ్మ. రజనికీ, శారదకూ కూడా ఈ సంభాషణ ఇబ్బందిని కలిగించింది. వాళ్ళిద్దరూ కూడా తల్లిని అనుసరించి లోపలికి వెళ్ళిపోయారు.

అరుణ పక్కకి వత్తిగిల్లింది. సన్నగా మూలిగింది. కలతనిద్రలోకి జారిపోయింది. కళ్ళముందు ఏవేవో దృశ్యాలు కలగా పులగంగా కదలసాగేయి.

దాసు తన కళ్ళముందు విహరిస్తూండేవాడు. రోజూ ఉదయం స్కూల్ మొదలయ్యే టైముకీ, సాయంకాలం స్కూల్ వదిలే సమయానికీ గేటు ముందు తయారు.

అతని చూపుల్లో ఏదో ఆకర్షణ.

క్రమేపీ మాటలూ కలిసినై.

"నీ కళ్ళల్లో వెలుగు — నన్ను సప్తసముద్రాలైనా దాటిస్తుంది.'' అన్నాడో రోజు. తనకెంత తన్మయత్వం కలిగిందారోజు.

రాత్రుళ్ళు ఉలిక్కిపడి లేచేది తను—అతను దగ్గర చేరి తన బుగ్గలు నిమిరినట్లు, కళ్ళ మీద సుతారంగా పెదవులు ఆనించినట్లు అనిపించేది. ఏదో స్వప్నలోకంలో తేలిపోయేది మనస్సు.

అతని రూపం, స్వభావం—తనని ఆకట్టుకున్నై.

**కల్పన**



ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవ సందర్భంగా హైద్రాబాదు బాలభవన్‌లో జరిగిన అంతర్ పాఠశాలల నాట్య పోటీలలో కుమారి కల్పన రెండవ స్థానం గెలుపొందింది. సికింద్రాబాదులోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అయిన కల్పన అక్కడి సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని నాట్యంలో ప్రథమ స్థానం సంపాయించింది. వెసలి కళాశాలలో 'ఇంట్రా ఇండియా ఈవినింగ్ డే' సందర్భంగా జరిగిన పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కల్పన రెండు సంవత్సరాలుగా ప్రఖ్యాత నాట్యాచార్యులు శ్రీ నటరాజ రామకృష్ణ వద్ద భరతనాట్యం నేర్చుకుంటున్నది. ముందు ముందు నాట్యంలో మరింత పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని అనుకుంటున్నది ఈ విద్యార్థిని.

నాలుగునెలలు మధురోహలతో గడిచిపోయినై.

ఆ రోజు — పండగరోజు. సాయంత్రం ఆరు గంటలవుతోంది. చిరుజల్లుపడుతోంది.

తను ముందుగదిలో కిటికీ దగ్గర కూర్చొని వుంది.

ఎదురు కాంపౌండులోనే దాసు రూమ్.

అతను రూమ్‌లో వున్నాడు. గుమ్మంలో నిలబడి కుడిచేత్తో వానతుంపరతో ఆడుకుంటున్నాడు.

ఇంటి ఆవరణలో బూరుగుచెట్టు మీది కొంగలు రెక్కలల్లార్చుకుంటూ ఎగురుతున్నై.

పిట్టగోడ దగ్గరి సపోటాచెట్టు ఆకులు నీటిలో తడిసి మెరుస్తున్నై.

తను ఇవన్నీ చూస్తూ ఆహ్లాదాన్ని అనుభవిస్తోంది.

దాసు రూమ్‌లో లైట్ వేశాడు. దీపపు కాంతిలో అతనారోజు మరీ అందంగా వున్నాడు.

తనని చూసి సన్నగా ఈలవేశాడు. తను సిగ్గుతో విలాసంగా నవ్వింది. ఏవిటీ విశేషం అన్నట్టు పెదవుల్ని సున్నాలా చేసి మరోసారి ఈలవేశాడు.

తను కళ్ళు చికిలించింది. వానజల్లు వెలిసింది.

అతను రూమ్ తాళం వేసి బయటికి పోతూ తనకి రమ్మని సైగచేసి వెళ్ళాడు.

ఇది రజని అక్క చూసింది.

"రాను రాను దీని వ్యవహారం ముదురుతున్న''దంటూ అమ్మకి ఫిర్యాదు చేసింది. అమ్మ గ్రుడ్లురిమి మొట్టికాయ వేసి, "పిచ్చి చేష్టలు చేస్తే గొంతుపిసికి చంపేస్తా, జాగ్రత్త'' అని హెచ్చరించింది.

తన కాళ్ళకు సంకెళ్ళుపడినై. తాటిప్రమాణంగా లేచిన ఉత్సాహం అణగారి గుండెల్లో పునాదులు కదిలినట్లయింది.

ఆ మర్నాడు —

దాసు తన స్కూల్‌కి వచ్చాడు.

"ఇవ్వాళ నీతో మాట్లాడాలి. వోగంట ముందు బయటికి''రమ్మన్నాడు.

వాళ్ళ కాలేజీ పక్కన డొంకరోడ్డు వెంట కలిసి నడిచేరు. జనసంచారం పల్చగా వుంది. అతను తనకు దగ్గరగా నడుస్తుంటే ఏదో పులకింత కలిగింది.

ఉన్నట్టుండి అతను తన అరచేతిని గిల్లేడు. మరో క్షణానికి బుగ్గ మీద చిటికెవేశాడు.

తను సిగ్గులమొగ్గ అయిపోయింది.

కొద్ది దూరం నడిచేక దారి ప్రక్కనున్న మద్దిచెట్టు వెనగ్గా కూర్చున్నారు.

కొన్ని నిముషాల తర్వాత అన్నాడతను—

"మీ యింటి స్థితిగతులూ, మీవాళ్ళ ఛాందసం, సంప్రదాయాలకి వాళ్ళిచ్చే విలువ ఇవన్నీ నాకు తెలుసు అరుణా. మీ అన్నయ్య కూడా ఆ తానులో పీలికే. అతను చదువుకుని నాలుగొందలు సంపాదిస్తున్నాడేగానీ, సంస్కారం తక్కువ—''

అతన్ని ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయింది తాను. అతని ఆలోచనలూ, వూహలూ ఎంత దూరం పోయినా, అతని మాటలూ ప్రణాళికా మాత్రం ఎన్నడూ నేల విడిచి పైకెగురలేదు.

తన ఆలోచనని గమనించనట్టుగా, "నా పరీక్షలు కాగానే నేను మా వూరెళ్తాను. నువ్వు కూడా నాతో రావాలి. మా అమ్మా నాన్నా వాళ్ళకి నిన్ను చూపిస్తాను. వాళ్ళ అంగీకారం పొందుదాం ముందు. వాళ్ళిద్దరూ టీచర్లు. మా నాన్న కవి కూడా. అక్కయ్య సమితి ఆఫీసులో టైపిస్టు. నా మాటని వాళ్ళు కాదనరు. వాళ్ళతో సంప్రదించి పెళ్ళి ప్రయత్నాలు చేసుకుందాం."

దాసు చెప్పినదానికి తను తల వూపింది.

అంతే!—దాసూ, తనూ వో సాయంత్రం "లేచిపోయారు!"

జరిగిందేమిటని ఒక్కరూ అడగరేం. తన కోసం ఏవేవో వూళ్ళు వెదికినట్లు పొద్దున అమ్మ లక్కల మాటల్లో విన్నది తను.

వీళ్ళందరికీ-తను దాసుతో వెళ్ళినట్లు తెలుసు. ఐనా, ఆ వాస్తవాన్ని నమ్మలేరు. ఏదో సందేహం. అలా కాకుండా వుంటే బాగుండునన్న కోరిక; నిద్రలోకి జారిపోయింది అరుణ.

అందరూ భోజనాలు చేసేరు. అరుణను ఎవ్వరూ పిలవలేదు. అసలు అరుణ అనే మనిషి ఆ యింట్లో ఒక మూల వుందనే విషయం కూడా ఎవ్వర్నూ అనుకోలేదు.

అయినా అరుణ అసలు లేచే పరిస్థితిలో లేదు. అలాగే మగతగా పడుకుని వుంది. కలత నిద్రలో ఆలోచనలతో సతమతమై అలసిపోతోంది.

మధ్యాహ్నం మూడు గంటలైంది. అరుణ కొద్దిగా కదిలింది. వొళ్ళంతా పచ్చి పుండులా వుంది. జ్వరం వచ్చినట్లుంది. గొంతు ఎండి పోయింది. నాలుక పిడుచ కట్టుకపోయింది. బాగా దాహం వేస్తోంది. మంచి నీళ్ళు కావాలి. లేవాలనుకుంది. లేవలేక ఎవరైనా ఇస్తే బాగుండు ననుకుంది.

కళ్ళు తెరచి చుట్టూ చూసింది అరుణ. రజని ఏదో వారపత్రిక చదువుతోంది. శారద గుమ్మంలో కూర్చుని జాకెట్ హుక్స్ కుడుతోంది. ప్రక్క గదిలో రామ్మూర్తి పడుకున్నట్లున్నాడు. సీతమ్మ లోపల ఏదో పనిలో వుంది. విశ్వం బయటకు వెళ్ళాడు కాబోలు. అందుకే ఇల్లు నిశ్శబ్దంగా వుంది. ముసలమ్మ వున్నా—లేనట్టే.

అరుణకు తనున్న పరిస్థితి గుర్తుకొచ్చింది.

ఇప్పుడు మంచినీళ్ళివ్వటం కాదు గదా, పిలిచినా పలకరనే సంగతి అర్థమైంది.

లేని వోపిక తెచ్చుకుని నెమ్మదిగా లేచి కూర్చుంది. పొద్దుట్నించి కడుపులో ఏమీ పడక పోవడం చేత కళ్ళు తిరిగేయి. పమిటతో మొహం తుడుచుకుంది. గోడ ఆసరా చేసుకుని లేచి నిల బడింది. నెమ్మదిగా తడబడుతున్న అడుగులతో వంటింటి గడపలోకి వెళ్ళింది. ఆ ప్రక్కనే వున్న కుండలోంచి రెండు గ్లాసుల నీళ్ళు ముంచు కుని త్రాగింది. మళ్ళీ వెనక్కు తిరిగి తన చోటులోకి వచ్చి ముడుచుకుని పడుకుంది అరుణ.

అంతవరకు అరుణనే గమనిస్తున్న రజని— "అమ్మా! ఆ కుండలో నీళ్ళు పారబోయ్యవే" అంది గట్టిగా.

'ఇంకా నయం, కుండ కూడా పారెయ్య మనలేదు' నవ్వుకుంది అరుణ, కళ్ళు మూసుకుంటూ.

పొద్దున విశ్వం అరుణను కొట్టినప్పటి నుంచీ సీతమ్మ అరుణను గురించి బాధపడ్తూనే వుంది. ఆవిడ ఎంత ప్రయత్నించినా మనసు నిగ్రహించుకో లేక క్షణ క్షణానికీ కళ్ళు వత్తుకుంటూనే వుంది. అరుణ మంచినీళ్ళు త్రాగి వెళ్ళడం చూసిన సీతమ్మకు కడుపులో ప్రేగులు కలచినట్లయింది. "పిచ్చి ముండ, పొద్దున్నుంచీ ఏమీ తినలేదు" అనుకుందే కాని, బయటపడి పిలవలేక పోయింది. పైకి మాత్రం బింకంగా తిరుగుతోంది. కూతురు కానిపనేదో చేసిందన్న కసిలో - సీతమ్మ, కన్న తల్లిగా అరుణకు ఆప్యాయతను అందించలేక పోతోంది. అలాకాకుండా, అరుణను ఒక్కసారి దగ్గరికి తీసుకుని వుంటే- అరుణే అన్ని విషయాలూ ఆవిడకు చెప్పేది. అందరి మనస్సుల్లోని తెరలూ తొలిగేవి.

రజని మాటలతో సీతమ్మ మనస్సు మరి కొంచెం గాయపడింది. రజని వైపు చురుగ్గా చూసింది. రజని అంతటితో వూరుకుని పుస్తకం లోకి దృష్టి మరల్చింది.

అక్క మాటలు విని నవ్వుకున్న అరుణ మళ్ళీ ఆలోచనల్లోకి జారిపోయింది.

తాను మైలపడి పోయింది కాబోలు వీళ్ళ దృష్టిలో తాను ఏమయింది? క్రొత్తగా ఏం కాలేదే. మామూలుగానే వుందే. తాను నిజంగా మైలపడి పోయిందా—అరుణ కళ్ళముందు జరిగిన సంఘటన మసకగా మెదిలింది.

తాను, దాసు తెల్లవారేసరికి హైద్రాబాదు చేరుకున్నారు. ఇంటికి వెళ్ళేసరికి ఆరు గంటలవు తోంది. తలుపు తీసిన దాసూ వాళ్ళమ్మ తనని చూసి తెల్లబోయింది. దాసుని చూసి విచ్చుకున్న ఆవిడ కళ్ళు, తనని చూసి ప్రశ్నించాయి. అంతలో తేరు కుని లోపలికి ఆహ్వానించింది. 'ఏం చెప్పాలా' అని సంకోచిస్తున్న తనను ఆప్యాయంగా లోపలికి తీసికెళ్ళింది.

కాఫీ టిఫిన్లయ్యాక దాసు అంతా చెప్పాడు.

కాసేపు ఆలోచనలయ్యాక, తన కుటుంబ పరిస్థితంతా అడిగి తెలుసుకున్నారు.

ఇంట్లో పెద్దవాళ్ళతో చెప్పకుండా చిన్న పిల్లను అలా తీసుకొచ్చా వెందుకని - దాసును చీవాట్లు వేశారు.

"తెలిసీ తెలియని వయసులో ఇలాంటి తొందరలు పనికిరావు. ఇంకా నీకు పెళ్ళి కావల సిన అక్కలుండగా నువ్విలా వచ్చేశావంటే వాళ్ళకి పెళ్ళిళ్ళెలా అవుతాయి? మీ నాన్నగారు, మీ ఇంట్లో వాళ్ళు వీధిలో తలెత్తుకుని తిరగ్గలరా? మీ ఇద్దరికీ ఎంత వయసుందని పెళ్ళికి తొందర పడ్డారు? మాకొక్క మాట తెలియజేసి వుంటే మేమే వచ్చి చెప్పేవాళ్ళం కదా! పోనీ మీ కంతగా చేసుకోవాలని వుంటే మాకేమీ అభ్యంతరం లేదు. కానీ మీరిద్దరూ బయటివాళ్ళ విమర్శలు భరించ గల స్థితిలో వున్నారా. అవి విని పట్టించుకోకుండా వుండగలిగే నిగ్రహం సంపాదించేవరకూ పెళ్ళి మాట ఎత్తకండి. మీది పెళ్ళికి తొందర పడాల్సిన వయసుకాదు. మీ చదువులు కానీయండి. ఈ లోపల పరిస్థితులన్నీ చక్కబడ్తాయి. అప్పుడే ఆలోచించ వచ్చు మీ పెళ్ళి గురించి." అది విన్న తర్వాత తను ఆలోచనలో పడింది.

దాసు అక్క తనతో ఎంతో స్నేహ భావంతో మెలగింది. తాను ఏ పరిస్థితిలో ఇల్లు వదిలి దాసుతో వచ్చేసిందో ఆ విషయాన్ని ఎంతో నేర్పుగా విమర్శించింది. అలా చేయవలసింది కాదని ఎంతో ఆపేక్షతో హెచ్చరించింది.

నిజంగా దాసు ఫామిలీని తలుచుకుంటే చేయెత్తి దణ్ణం పెట్టాలనిపిస్తోంది తనకి.

"దాసుని ఎప్పుడు పెళ్ళి చేసుకుంటానా" అని ముందు వెనుకలు ఆలోచించకుండా తహతహ లాడిన తన మనసులో అసలు పెళ్ళి అనే మాటే లేకుండా చేశారు.

నిజమే! తన ముందు ఎంతో అందమైన భవిష్యత్తు వుంది. బాగా చదువుకుని వుద్యోగం

చేయాలి. నలుగురిలో మెప్పు సంపాదించాలి. నాలుగు డబ్బులు వెనకేసుకోవాలి. అప్పుడే పెళ్ళి మాట. అంతవరకు పెళ్ళిని గురించి ఆలోచించ కూడదు.

అవును. వాళ్ళు అన్నదీ నిజమే. దాసుకి ఇంకా ఉద్యోగం లేదు. తనని, పుట్టబోయే పిల్లల్ని ఏం పెట్టి పోషిస్తాడు. ఉద్యోగం దొరికేదాకా అతని తల్లిదండ్రుల మీద ఆధారపడాల్సి వచ్చేది. సంసారం పెరిగి వచ్చే జీతం చాలక ఎంతో నరకాన్ని అనుభ పించాల్సి వచ్చేది. తన పెళ్ళి దాసుతో జరిగిన క్షణం తన వాళ్ళ దృష్టిలో తాను చచ్చిన దాని క్రిందే లెక్క. కొత్త సంసారం మోజుగా బాగానే జరిగినా రోజులు గడుస్తున్న కొద్దీ దాసూ, తానూ కలతలతో, కన్నీళ్ళతో ఒకరి మీద ఒకరు అస హ్యంతో బ్రతకాల్సి వస్తుంది.

ఈ విషయాన్ని ఎంత సున్నితంగా చెప్పారు వాళ్ళు. రెండు రోజులు తమతో వుంచుకుని తన ఆలోచనలని మంచి మార్గంలోకి మళ్ళించి, నచ్చ జెప్పి ఇంటికి పంపించారు.

కానీ–వీళ్ళేమిటి? తనను ఇలా చూస్తున్నారు!

తాను చెడిపోలేదని వీళ్ళకెలా తెలుస్తుంది. తాను చేసింది తప్పే. ఇంట్లో చెప్పకుండా దాసుతో వెళ్ళి పోవడమే–తాను చేసిన తప్పు. కొంచెం నిదానించి అడిగి వుంటే తానే అంతా వీళ్ళకు చెప్పి వుండేది.

ఏదీ – తనకలా చెప్పే అవకాశం ఎవరిచ్చారు? పైగా–తనని ఎంత నీచంగా చూస్తున్నారు. అరుణ కళ్ళ వెంట నీళ్ళు జలజలా కారాయి.

తలక్రింద వున్న సంచి చల్లగా అనిపించడంతో నెమ్మదిగా కళ్ళు తెరిచింది అరుణ.

అంతా చీకటిగా వుంది.

అంటే – అప్పుడే రాత్రయిపోయిందా! ఇంత సేపు తను ఒళ్ళు తెలీకుండా పడుకునే వుందా!

అరుణ నెమ్మదిగా లేచింది. బెడ్‌లైట్ వెలు గులో అంతా అస్పష్టంగా కనబడుతోంది. ఇంట్లో వాళ్ళందరూ నిద్రలో వున్నట్టున్నారు.

తల విపరీతమైన పోటుగా వుంది. కణతలు బ్రద్దలవుతున్నాయి.

దొడ్లోకి వెళ్ళాలనుకుంది. వంట యింటి గడప దాటింది. ఒళ్ళు తూలింది. నెమ్మదిగా గోడ పట్టు కుని వెళ్ళి దొడ్డి తలుపు తీసింది.

వంట ఇంటిని ఆనుకుని వున్న గదిలో బామ్మ పడుకుని వుంది. తలుపు తీసిన చప్పుడు పెద్దగా అవడంతో "ఎవరది" అంటూ కేకేసింది బామ్మ. అరుణ సమాధాన మివ్వలేదు. మళ్ళీ గట్టిగా అడి గింది ముసలమ్మ. తను సమాధానం చెప్పకపోతే ఇంట్లో అందర్నీ పిలుస్తుందన్న భయంతో, అరుణ ఒక్క అంగలో బామ్మ గదిలో అడుగు పెట్టింది.

మంచం దగ్గరికి వెళ్ళి 'నేను బామ్మా' అంది గట్టిగా.

"నువ్వటే అమ్మడూ" బామ్మ కుడిచేయి చాచింది.

అరుణ దుఃఖం కట్టలు తెంచుకుంది. బామ్మ చేతిలో ఇమిడిపోయింది. బామ్మ నెమ్మదిగా ప్రక్కకి జరిగి అరుణకి మంచంలో చోటిచ్చింది.

"అరుణా, ఏం జరిగిందమ్మా! నాతో చెప్పు తల్లీ!"

ఆ కంఠంలోని ఆప్యాయతకు అరుణ మనసు చలించింది. వెక్కిళ్ళ మధ్య – దాసూ వాళ్ళింట్లో జరిగిందంతా చెప్పింది. బామ్మ చేయి అరుణ వీపుని నిమురుతూనే వుంది.

తెల్లవార వచ్చింది. అరుణ అలా ఏడుస్తూనే వుంది. ఏడుపు మధ్య చెప్పుతూనే వుంది.

"ఇవాళ దాసూ వాళ్ళక్కకి పెళ్ళి నిశ్చయం చేసుకుంటున్నారట బామ్మా .... అందుకే వాళ్ళు నాతో రాలేదు. ఇవాళ నన్ను కూడా వుండ మన్నారు కానీ, నేనే వుండనంటే నన్ను పంపిం చారు. రేపు దాసూ వాళ్ళ నాన్నగారు వచ్చి అన్నీ మన నాన్నగారితోనూ, అన్నయ్యతోనూ చెప్పుతా నన్నారు. పైగా వాళ్ళకు తెలిసిన వాళ్ళు-మనవాళ్ళే వున్నారట. అక్కయ్యలకు సంబంధాల విషయం కూడా మాట్లాడతానన్నారు. కానీ–వీళ్ళు చూశావా బామ్మా నన్నెట్లా చంపేశారో —" మళ్ళీ ఏడు పొచ్చింది అరుణకు.

కళ్ళు తుడుచుకుని తల పైకెత్తిన అరుణకు— అమ్మా, నాన్న, అక్కయ్యలు, అన్నయ్య అంతా వరసగా కనిపించారు.

వాళ్ళ మొహాల్లో అంతవరకూ కమ్ముకున్న మబ్బు విడిపోయింది.

అందరి మొహాల్లోనూ ఆశ్చర్యం, ఆనందం వెల్లి విరుస్తోంది. అంతకు మించి – 'అరుణ చెడి పోలేదన్న' తృప్తి తొంగి చూస్తోంది. □

## ఎస్. గీతారాణి



కుమారి సామవేదుల గీతారాణి విజయనగరం లోని, గీతా ఆర్ట్స్ అకాడమీ స్థాపకురాలు. ఆ సంస్థ కార్యదర్శిగా నగరంలో ఆమె అనేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె మోహనజ్యోతి కళాకారుల సమాఖ్యకు జిల్లా కార్యదర్శి కూడా.

కుమారి గీతారాణి వర్ధమాన రచయిత్రిగా మంచి పేరు తెచ్చుకున్నారు. దాదాపు నూటికి పైగా కథలు, అనేక నవలలు రాశారు. వీరి తొలి నవల, మొదటిసారిగా ప్రచురణ అయినది- "కాలయాగంలో జీవనకలశం". ఆమె రచించిన "మోహనరాగం", "పద్మవ్యూహం" అనే రేడియో నాటికలు ప్రసారం చెయ్యబడ్డాయి. 1978 సం॥లో వంశీ అండ్ బర్కిలీ సంస్థవారు నిర్వహించిన ఉత్తమ రచనల అవార్డు పోటీలలో ఆమె రచించిన "కలియుగ సీత" అన్న నవలకు బహుమతి లభించింది. (ఆ నవల ధారావాహికంగా "స్వాతి"లో ప్రచురిత మయింది) ఆమె రచించిన రెండు క్రైమ్ నవలలకు ఉత్తమ నవలా బహుమతులు లభించాయి.

ఆమె ఆశయం గురించి అడిగినప్పుడు—

నేటి సమాజాన్ని ప్రగతిపథానికి నడిపించే ప్రయోజనాత్మక రచనలు చేయాలనేది తన ధ్యేయమని, సాంఘికపరమైన సృజనాత్మక రచనలు చేయడానికే తాను నిత్యం ప్రయత్నిస్తానని ఆమె అన్నారు.

వరకట్నం సమస్యపై ఆమె అభిప్రాయం తెలుపుతూ 'యిప్పటి యువతరమే ఆ దురా చారాన్ని పరిష్కరిస్తుందని' ఆమె అన్నారు.

—విలేకరి